

## నేడు అంతర్జాతీయ తల్లిపాల దినోత్సవం

**పార్వతీపురం రూరల్, ఆగస్టు6 :** జిల్లాలో బుధవారం అంతర్జాతీయ తల్లిపాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు స్త్రీ, శిశుసంక్షేమ శాఖాధికారి బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఈ కార్య క్రమం ప్రారంభమవుతుందన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణా నిరోధక చట్టం, గృహహింస, మహిళల రక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# డబుల్ హ్యాపీ





- నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కూటమి సర్కారు కసరత్తు
- గ్రామాల్లో 3 సెంట్లు.. పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం
- గృహ నిర్మాణానికి రూ.4లక్షలు
- గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన దానికి ఇది రెట్టింపు
- పాత లబ్ధిదారుల బకాయిల చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్
- సీఎం చంద్రబాబు నిర్ణయంపై జిల్లా వాసుల హర్షం

**పార్వతీపురం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి):** పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని ఇప్పటికే సీఎం చంద్రబాబు నిర్ణయించారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున కేటాయించాలని నిశ్చయించారు. మరోవైపు 2014-19 మధ్య పూర్తయిన ఇళ్లకు గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చెల్లింపులు చేయలేదు. ఆ ఇళ్ల బాధితులకు కూడా వెంటనే చెల్లింపులు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు చొప్పున ఇచ్చి ఊరూవాడా డబ్బా కొట్టుకుంది. ఇప్పుడు కూటమి సర్కారు దానికి రెట్టింపు ఇవ్వాలని నిశ్చయించింది. అంతేగాకుండా నిర్మాణ మొత్తాన్ని డబుల్ చేయడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సీతానగరం మండలం పెదబోగిల గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ఇలా..

### ఇదీ పరిస్థితి..

'పేదవారికి ఇళ్లు కట్టిస్తాం.. అర్హులందరికీ స్థలాలు ఇస్తాం' అని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన వైసీపీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు భిన్నంగా వ్యవహరించింది. పట్టణాలు, పల్లెలకు శివార్లలో కొండలు, గుట్టలు, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో చాలీచాలని ఇళ్ల స్థలాలు కేటాయించింది. గృహ నిర్మాణాలపై ఒత్తిడి తెచ్చి లబ్ధిదారులను అప్పులపాల్జేసింది. పైగా జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు కాదు.. ఏకంగా ఊళ్లే నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం చేతులెత్తేసింది. లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించలేదు. ప్రధానంగా రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పించలేదు. కీలకమైన రహదారులు లేకపోవడంతో గృహ నిర్మాణ సామగ్రిని కూడా తీసుకెళ్లలేని పరిస్థితి. వర్షం కురిస్తే.. ఆ మార్గమంతా బురదమయం కాగా.. లేవుట్లన్నీ ముంపునకు గురయ్యేవి. మరోవైపు గృహ నిర్మాణాలకు రూ.లక్షా 80 వేలు మంజూరు చేయగా.. ఇందులో కేంద్రం వాటా రూ.30 వేలు. అయితే ఈ మొత్తం ఇంటి పునాదులకే సరిపోని పరిస్థితి.. 'ఇంటి స్థలం ఇచ్చాం.. వెంటనే నిర్మించండి.. లేకుంటే రద్దు చేస్తాం' అని ఇంకోవైపు అధికారుల నుంచి ఒత్తిడి తేవడంతో ఎంతోమంది లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టారు. అయితే ఇళ్ల పనులను మాత్రం పూర్తి చేయలేకపోయారు. అప్పులకు వడ్డీలు చెల్లించలేక.. మధ్యలోనే తమ ఇళ్ల నిర్మాణాలను నిలిపివేశారు. ఊరు శివార్లలో నివాసయోగ్యం కాని చోట స్థలాలు ఇవ్వడంతో మరికొంతమంది అసలు నిర్మాణాలు ప్రారంభించలేదు. మరికొందరు పునాదులతో సరిపెట్టారు. మొత్తంగా జగనన్న లేవుట్లన్నీ మొండి గోడలు, పునాదులు, వివిధ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలతోనే దర్శనిస్తున్నాయి. పూర్తిస్థాయిలో గృహ నిర్మాణాలు చేపట్టిన వారు అతి తక్కువ మందేనని చెప్పొచ్చు. జిల్లాలో 1,03,976 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 51,191 మందికి స్థలాలను కేటాయించి ఇంటి పట్టాలు ఇచ్చారు. మిగిలిన వారంతా సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారేనని చెప్పొచ్చు.

### విశాలమైన స్థలంలో....

గత ప్రభుత్వ హయాంలో పేదల కష్టాలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. కొత్త లబ్ధిదారులకు ఏ ఇబ్బందులు లేకుండా విశాలమైన స్థలాలు కేటాయించాలని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల వరకు మంజూరు చేయాలని నిశ్చయించింది. మధ్యతరగతి వర్గాలకు కూడా తక్కువ ధరకే ఇళ్లు ఇవ్వాలని తీర్మానించారు. పాత వారికి బకాయిల చెల్లింపునకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీనిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో సర్వత్రా హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



# శ్రావణ సందడి

- పైడిమాంబకు ప్రత్యేక పూజలు

**విజయనగరం రూరల్, ఆగస్టు 6:** శ్రావణమాస సందడి మొదలైంది. తొలి మంగళవారం కావడంతో ఉమ్మడి జిల్లాలో ప్రముఖ ఆలయాలన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అర్చనలు, సామూహిక కుంకమ పూజలతో అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం విజయనగరం పైడిమాంబ దర్శనానికి భక్తులు బారులుదీరారు. ఉదయం 4.45 గంటలకు సుప్రభాత సేవ అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అదే విధంగా ప్రత్యేకంగా హోమాలు జరిపారు. వనంగుడిలో కూడా శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు..

# ముగిసిన ఉపాధ్యాయుల కౌన్సిలింగ్


**పార్వతీపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):** పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో పీవో ఎస్.సేదు మాధవన్ పర్యవేక్షణలో 76 మంది టీచర్లకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఉపాధ్యా యులు ఎంచుకున్న ఐచ్ఛికాల ప్రకారం బదిలీలు చేపట్టారు. కోరిన స్థానాలకు పారదర్శకంగా స్థాన చలనం కల్పించామని, వెంటనే విధుల్లో జాయిన్ అవ్వాలని పీవో సూచించారు. ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. విద్యారులకు నాణ్యమైన విద్యను అందించాలని టీచర్లను ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు రుక్మాంగదయ్య, డిప్యూటీ డీఈవో సుగుణ, పీఎంఆర్‌సీ ఏఎంవో రాయుడు, సహాయ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.




కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో

# 9న చంద్రబాబు రాక

- ఆదివాసీ దినోత్సవంలో పాల్గోనున్న ముఖ్యమంత్రి



**పార్వతీపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా పార్వతీపురం మన్యం జిల్లాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నారు. ఈ నెల 9న నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవంలో ఆయన పాల్గోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అప్రమత్తం చేశారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయా లని సూచించారు. రాష్ట్రస్థాయి వేడులకు అవసరమైన స్థల పరిశీలన, తదితర అంశాలపై ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఆదివాసీ దినో త్సవం ఎక్కడ నిర్వహిస్తారన్నది బుధవారం నాటికి స్పష్టత రానుంది. అయితే అత్యధిక శాతం సీతంపేట మండలంలోని వేడుకలు నిర్వహిం చనున్నట్లు తెలుస్తోంది. ఈ దినోత్సవంలో సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు.

### స్థల పరిశీలన

**గుమ్మలక్ష్మీపురం:** సీఎం చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం, మండ, భద్రగిరి హెడ్ గ్రౌండ్, జేకేపాడు కాలనీ, కుంటుబాయ్‌లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ స్థల పరిశీలన చేశారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అయితే ఆదివాసీ దినోత్సవం ఎక్కడ నిర్వహిస్తారన్నది ఇంకా నిర్ణయించలేదు. అనంతరం గుమ్మలక్ష్మీపురంలో గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని సందర్శించారు. గర్భిణులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జేసీ శోభిక తదితరులు ఉన్నారు.



మండ ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

# బదిలీల కోసం ఎదురుచూపు

- సొంత మండలాలకు వచ్చేందుకు ఎంపీడీవోల ప్రయత్నాలు



**గరుగుబిల్లి, ఆగస్టు 6 :** సార్వత్రిక ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఎంపీడీవోలు తిరిగి సొంత మండలాలకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు. ఇటీవల జిల్లాలోని 15 మండలాల్లో తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ ముగిసింది. వారికి మండలాలను కూడా కేటాయించారు. విధుల్లో చేరిన తర్వాత కూడా కొన్నిచోట్ల మార్పులు చేశారు. అయితే ఎంపీడీవోల బదిలీల విషయంలో మాత్రం ఇంకా ఎటువంటి కదలిక లేదు. తీవ్ర జాప్యం నెలకొనడంతో కొందరు సెలవుపై వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చి మన్యంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవోలను బదిలీ చేయకముందే పలువురు ఆయా స్థానాల్లో చేరేందుకు పావులు కదుపుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు ఎంపీడీవో కార్యాలయం పరిధిలోని పంచాయతీ విస్తరణాధికారులు కూడా ఆయా మండలాల నుంచి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

**పాలకొండ:** గిరిజన గ్రామాల్లో హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని నీలమ్మ కాలనీలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పలు ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బందితో సమీక్షించారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. డీవార్మింగ్ డే సందర్భంగా 1-19 సంవత్సరాలు ఉన్న పిల్లల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. సీజనల్ జ్వరాలు ప్రబలకుండా చూడాలని, ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం వరల్డ్ మెంటల్ హెల్త్‌డే కార్యక్రమంలో పాల్గొని కొన్ని సూచనలు చేశారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో



# అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి

'నూతన జిల్లా పార్వతీపురం మన్యం అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి.. గిరిజనులకు పూర్తిస్థాయిలో సేవలందించండి.. జిల్లావాసులకు మెరుగైన పాలన అందించండి.. శాంతి భద్రతలను కాపాడండి.. ఇందుకోసం సమగ్ర ప్రణాళిక రూపొందించండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డికి సూచించారు. అమరావతి సచివాలయంలో కలెక్టర్ల సదస్సు ముగిసిన తర్వాత సోమవారం రాత్రి విందులో జిల్లాల వారీగా కలెక్టర్, ఎస్పీలతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. - పార్వతీపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి)

# ఆధార్ అవస్థలు

- ఈకేవైసీ, అప్‌డేట్ చేసుకుంటే.. రిజక్టెడ్ అని మెసేజ్
- ఎన్నిసార్లు చేసినా.. ఇదే తీరు
- కొంతమందికే ఎదురవుతున్న సమస్య
- విశాఖ జోనల్ కార్యాలయానికి వెళ్లినా దక్కని ఫలితం
- పథకాలకు దూరమవుతున్న వైనం
- కలెక్టర్ స్పందించాలని మండల వాసుల విన్నపం




అప్‌డేషన్ కోసం బత్తిలి ఆధార్ సెంటర్‌కు వచ్చిన గ్రామస్థులు (ఫైల్)

**భామిని:** ఈ రోజుల్లో ఆధార్‌కార్డు లేకుంటే ఈ పనీ చేయలేం. ఏ పథకాలూ పొందలేం. రేషన్ నుంచి పింఛన్ల వరకూ అన్నింటికీ ఆధార్ అవసరం. అయితే ఎంతో కీలకమైన ఆధార్‌కార్డు ఈకేవైసీ, అప్‌డేట్ చేసుకునేందుకు మండల వాసులు పడరాని పాట్లు పడుతున్నారు. చిన్నారులు నుంచి సీనియర్ సిటిజన్ల వరకు అంతా నానా అవస్థలు పడుతున్నారు. అప్‌డేట్ కాకపోతే పథకాలు ఎక్కడ అందవోనని అత్యధికులు ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. అయితే గంటలకొద్దీ నిరీక్షించి ఆధార్‌కార్డు ఈకేవైసీ, అప్‌డేట్ చేసుకుంటున్నా.. కొందరికి ఫలితం దక్కడం లేదు. ఈ ప్రక్రియ పూర్తయిన రెండు, మూడు రోజుల తర్వాత వారి సెల్‌కు రిజక్టెడ్ అని మెసేజ్ రావడంతో తలలు పట్టుకుంటున్నారు. మళ్లీ మీ సేవ కేంద్రాలకు వెళ్లి అప్‌డేట్ చేసుకుంటున్నారు. ఇలా ఎన్నిసార్లు చేసినా రిజక్టెడ్ అని మెసేజ్ వస్తుండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై మీ సేవ నిర్వాహకులను ప్రశ్నిస్తున్నా.. ఫలితం ఉండడం లేదు. తామేమీ చేయలేమని వారు చేతులెత్తేస్తున్నారు. విశాఖ, హైదరాబాద్‌లోని ఆధార్ జోనల్ కార్యాలయాలకు వెళ్లాని డిజిటల్ ఆపరేటర్లు ఉచిత సలహాలు ఇస్తున్నారు. దీంతో కొందరు విశాఖ వెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు. భామినికి చెందిన కోలక మల్లేష్, శిర్ల వంశీ, సొలికిరికి చెందిన నిమ్మల తరుణ్, బిల్లుమడకు చెందిన కాకర్ల శ్రావణి ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీకి, టెన్త్ సర్టిఫికెట్‌లో ఉన్న డేట్ ఆఫ్ బర్త్‌కు పొంతన లేకపోవడంతో ఈకేవైసీ చేసినా వారి సమస్య పరిష్కారం కాలేదు. ఇలా ఎంతోమంది ఆధార్ సమస్యతో సతమతమవుతున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

### ఎవరూ పట్టించుకోవట్లే..



నేను 2019లో ఆధార్ ఈకేవైసీ చేసుకున్నా. అయితే ఆ తర్వాత ఆధార్ సస్పెండ్ అని మెసేజ్ వచ్చింది. దీంతో అప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నా. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వసతి గృహంలో చేరలేకపోయా. భామిని, కొత్తూరు, సీతంపేట ఆధార్ సెంటర్లలో నమోదు చేశాక వారి సలహా మేరకు విశాఖ వెళ్లి నమోదు చేసినా ఫలితం దక్కలేదు. ఆధార్ పనిచేయకపోవడంతో హాస్టల్‌లో భోజనం ఏర్పాటు చేయలేమని ఇంటికి పంపించారు. గత ఏడాది కలెక్టర్ ఆదేశాల మేరకు భోజనం పెట్టారు. ఈ ఏడాది ఎవరూ పట్టించుకోవడం లేదు.

-శిర్ల వంశీ, విద్యార్థి, భామిని

### అధికారులు స్పందించాలి..



నా ఆధార్ అప్‌డేట్ కావడం లేదు. రేషన్, పింఛన్లు ఇచ్చే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈకేవైసీ కాలేదని చెబుతున్నారు. విశాఖ వెళ్లి మీసేవ కేంద్రంలో ఆధార్ అప్‌డేట్ చేసినా ఫలితం దక్కలేదు. రిజక్ట్ అని చూపిస్తుంది. దీనిపై అధికారులే పరిష్కరించాలి.

-కోలక మల్లేష్, రైతు కూలి, భామిని

### అవగాహన లేదు..

ఈ సమస్యలపై ఎటువంటి అవగాహన లేదు. మీసేవ కేంద్రాల నిర్వాహకులను సంప్రదించా.. విశాఖలో ఆధార్ జోనల్ కార్యాలయానికి వెళ్తే.. సమస్య పరిష్కారమవుతుందని వారు చెబుతున్నారు. ఆధార్‌కార్డును దీర్ఘకాలికంగా వినియోగించని వారికే ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-ఎ.శేఖరం, డిప్యూటీ తహసీల్దార్, భామిని

# వివిధ కోర్సుల్లో శిక్షణకు క్యూఆర్ కోడ్

- గిరిజన యువత కోసం ప్రయోగాత్మకంగా అమలు: పీవో

**సీతంపేట, ఆగస్టు 6:** గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ రూపొందించినట్లు పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'క్యూఆర్ కోడ్ ఓపెన్ చేయగానే వచ్చే లింకును క్లిక్ చేస్తే గూగుల్ దరఖాస్తు ఓపెన్ అవుతుంది.. అందులో నిరుద్యోగ యువతకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా నింపాలి. నచ్చిన కోర్సును ఎంచుకుని దరఖాస్తును సబ్‌మిట్ చేయాలి. ఆ డేటా ఆధారంగా ఎక్కువ మంది యువత ఎంచుకున్న కోర్సుపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తాం' అని పీవో తెలిపారు.

## ఇఫ్లూలో బీఏ(ఆనర్స్/ రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. షిల్లాంగ్, లఖ్‌నవూ ప్రాంతీయ క్యాంపస్‌లలో కూడా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. సీయూఈటీ యూజీ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఏటా నిర్దేశిత కోర్సులు పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. ఏడాది కోర్సు పూర్తిచేసి యూజీ సర్టిఫికెట్, రెండేళ్ల కోర్సు పూర్తిచేసి యూజీ డిప్లొమా, మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఏ డిగ్రీ, నాలుగేళ్లు చదివి బీఏ ఆనర్స్/రీసెర్చ్ డిగ్రీ పొందవచ్చు.

**అర్హత**: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. సీయూఈటీ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/UMXeSxkలో చదవండి.

## సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్



హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- 'పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు.

**స్పాట్ అడ్మిషన్స్:** అభ్యర్థులు ఆగస్టు 19న డిప్లొమా బ్లాక్‌లో రిపోర్ట్ చేయాలి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదిన్నర వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. మధ్యాహ్నం పదకొండు నుంచి పన్నెండున్నర వరకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. సాయంత్రం రెండు గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. తరవాత కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.

- **స్పాట్ అడ్మిషన్స్ తేదీ:** ఆగస్టు 19
- **వేదిక:** రూమ్ నెంబర్ 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037.
- **వెబ్‌సైట్:** www.citdindia.org

## ఎన్‌జీ రంగా వర్సిటీలో బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్(ఫార్మర్స్ కోటా) కింద బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

## దిక్సూచి DIKSUCHI

**SCHOLARSHIP ALERT**

### Aspire

***Description:*** Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

***Eligibility:*** Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

***Prizes & Rewards:*** Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

***Last Date to Apply:*** 10-09-2024
***Application mode:*** Online only
***Short Url:*** www.b4s.in/aj/ASPI2

### Raman Kant Munjal

***Description:*** The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

***Eligibility:*** Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

***Prizes & Rewards:*** Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years ***Last Date to Apply:*** 20-08-2024
***Application mode:*** Online only
***Short Url:*** ww.b4s.in/aj/RMKSP4

buddy4study.com

# నవ్య | చిత్రజ్యోతి

## బరువెక్కిన హృదయంతో...



గతంలో కుదుర్చుకున్న పలు చిత్రాల ఒప్పందం కారణంగా బిగ్‌బాస్ నుంచి స్వల్ప విరామం తీసుకుంటున్నట్టు అగ్రనటుడు కమల్ హాసన్ ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించారు. 'ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రయాణం నుంచి ఒక చిన్న విరామం తీసుకుంటున్నాననే విషయాన్ని బరువెక్కిన హృదయంతో ప్రకటిస్తున్నాను. బిగ్ బాస్ కారణంగానే మీ ఇళ్ళకు వచ్చి మిమ్మల్ని కలుసుకునే భాగ్యం నాకు లభించింది. మీరు అందించిన ఉద్వేగపూరిత, ఉత్సాభరిత మద్దతు, ఆదరణ కారణంగా బిగ్‌బాస్ తమిళ సీజన్ దేశంలోనే ఉత్తమ టెలివిజన్ రియాలిటీ షోలలో ఒకటిగా మారింది. ఒక ప్రెజెంటర్‌గా నేను వ్యక్తిగతంగా నేర్చుకున్న అనేక విషయాలను నిజాయితీగా మీతో పంచుకున్నాను' అని కమల్ హాసన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి (చెన్నై)

## 'దేవర' నటుడికి అరుదైన వ్యాధి



మలయాళ నటుడు షైన్ టామ్‌చాకో.. 'దసరా', 'రంగబలి' వంటి సినిమాలలో ప్రతినాయక పాత్రలతో తెలుగులోనూ పాపులర్ అయ్యారు. ఇప్పుడు ఆయన ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'లోనూ విలన్‌గా కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో.. తనకు అటెన్షన్ డెఫిసిటీ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏ.డీ.హెచ్.డీ) ఉందని తెలిపారు. ఈ వ్యాధి ఉండే వారు ఇతరుల కంటే ప్రత్యేకంగా కనిపించడానికి ప్రయత్నిస్తారని.. అయితే ఇందుకు తానేం బాధపడట్లేదని.. దీన్నే పాజిటివ్ క్వాలిటీగా భావిస్తా అని చెప్పారు.

## క్రేజీ ప్రాజెక్ట్‌కు 9న శ్రీకారం



జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం ఈ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. 'కే.జీ.ఎఫ్' చిత్రంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించే ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమా గురించి నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ యలమంచి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'శుక్రవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా సినిమాను ప్రారంభిస్తున్నాం. రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్‌లో మొదలవుతుంది. ఎన్టీఆర్ అక్టోబర్ నుంచి షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ లోపు ఆయన లేని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. హీరోయిన్ ఎవరన్నది ఇంకా ఎంపిక చేయలేదు' అని చెప్పారు. ప్రస్తుతం తను నటిస్తున్న 'వార్ 2' చిత్రం షూటింగ్‌ను ఈలోగా పూర్తి చేసి, ప్రశాంత్ నీల్ చిత్రం మీద పూర్తిగా దృష్టి పెట్టనున్నారు ఎన్టీఆర్. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మించనున్నారు. పూర్తి వివరాలను చిత్ర ప్రారంభోత్సవం రోజున వెల్లడిస్తారు.

## ఇండస్ట్రీ ఏ ఒక్క ఫ్యామిలీ సొత్తు కాదు



'వీళ్లు తప్ప మరేవరూ ఉండరు' అంటూ మెగా ఫ్యామిలీపై చేస్తున్న విమర్శలపై నటుడు నాగబాబు స్పందించారు. సోమవారం 'కమిటీ కుర్రోళ్లు' సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ "సినిమా ఇండస్ట్రీలో ఎటు చూసినా మెగా ఫ్యామిలీదే ఆధిపత్యం.. కొందరి ఎదుగుదలను ఆ ఫ్యామిలీ అడ్డుకుంటోందని అని ఎంతో మంది సార్లు అనడం విన్నాను. అలా అనడం ముమ్మాటికీ తప్పు. మాకు అలాంటి ఫీలింగ్ లేదు. ఇండస్ట్రీ మా తాత సొత్తు కాదు.. మా నాన్న సామ్రాజ్యం కాదు. అలాగే నందమూరి ఫ్యామిలీది కాదు, అక్కినేని కుటుంబానిది కాదు. ఇండస్ట్రీ అందరికీ చెందినది. సినిమా కుటుంబ నేపథ్యం ఏమీ లేకపోయినా అడవి శేష్ వంటి హీరోలు తమ టాలెంట్‌తోనే పైకి వచ్చారు. వారికి ఎవరూ అడ్డం పడలేదుగా. ఇప్పుడు 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంలో నటిస్తున్న వాళ్లు ఏ రేంజ్‌కి వెళతారో ఎవరన్నా ఊహించగలరా! ఈ రోజు సినిమాలే కాదు.. ఆర్టిస్టుల కోసం ఎన్నో ఓటీటీ వేదికలు ఉన్నాయి. మంచి కంటెంట్ ఉన్న సినిమాకి ట్రై చేయండి. రెగ్యులర్ సినిమాల్లో రొటీన్ క్యారెక్టర్స్ కోసం ప్రయత్నించకండి" అని చెప్పారు.


## సినిమా చెట్టును తిరిగి బతికిస్తాం!



సినిమా చెట్టును శాస్త్రీయ పద్ధతిలో తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తూర్పుగోదావరి జిల్లా డీఎఫ్‌వో బి.నాగరాజు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు సోమవారం తెల్లవారుజామున పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ చెట్టు కూలిపోయిందనే విషయం తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో రోజంతా ఇదే విషయం హాట్ టాపిక్‌గా మారింది. కాగా అమరావతి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం డీఎఫ్‌వో బి.నాగరాజు, డీఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో ఎం.కార్తీక్ ఈ సినిమా చెట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నాగరాజు మాట్లాడుతూ పడిపోయిన చెట్టును సైంటిఫిక్‌గా తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి (కొవ్వూరు)

## వామ్మో.. రూ.పది కోట్లా?



దక్షిణాదిలో కొంత కాలం పాటు అగ్ర నటిగా కొనసాగిన సమంత.. స్టార్ హీరోలకి ఏ మాత్రం తగ్గని రేంజ్‌లో పారితోషికం అందుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే లేటెస్ట్‌గా అందిన సమాచారం మేరకు.. ఆమె తీసుకునే పారితోషికం రూ.పది కోట్లకు చేరిందట. అదీ సినిమాకు కాదండోయ్. 'హనీ బన్నీ' అనే స్పై థ్రిల్లర్ వెబ్ సిరీస్‌కు. 'సిటాడెల్' అనే ఆంగ్ల వెబ్ సిరీస్‌కు భారతీయ వెర్షన్‌గా తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్ కోసం రూ.పది కోట్ల రికార్డు పారితోషికం సమంత అందుకున్నారట. వరుణ్‌ధావన్‌తో కలసి నటించిన ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవ్వనుంది. ఇంతకు ముందు కూడా ఓ ప్రాజెక్ట్ కోసం ఒక బాలీవుడ్ ప్రొడ్యూసర్ భారీ మొత్తం సమంతకు ఆఫర్ చేయగా.. ఆమె తిరస్కరించారని టాక్. ఆ ప్రొడ్యూసర్ సమంతకు భారీ పారితోషికంతో పాటు లాభాల్లో 25 శాతం వాటా కూడా ఆఫర్ చేశారట. సమంత ఆ చిత్రాన్ని అంగీకరించి ఉంటే అది ప్రస్తుతం ఆమె ఈ సిరీస్ కోసం తీసుకున్న రూ.పది కోట్ల కంటే ఎక్కువే అయ్యేది.

## కొత్తగా..

### సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా'



యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ నటించే కొత్త చిత్రం 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ మంగళవారం ప్రారంభమైంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 30 రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలు, పాటలు చిత్రీకరిస్తామని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ చెప్పారు. తొలి రోజు షూటింగ్‌లో రాశీ ఖన్నా కూడా పాల్గొన్నారు. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. వైవా హర్ష ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని, జ్ఞానశేఖర్ బాబా ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.

### ప్రేమికులు రిలేట్ అయ్యేలా...



విజయ్‌శంకర్, విషిక జంటగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇదనీ, ప్రేమలో ఉన్న ప్రతి లవర్ రిలేట్ చేసుకొనేలా సినిమా ఉంటుందని విజయ్‌శంకర్ చెప్పారు. తను పోషించిన పాత్ర చూశాక అమ్మాయిలు తమ బాయ్‌ఫ్రెండ్స్‌ని ఇబ్బంది పెట్టరని హీరోయిన్ విషిక చెప్పారు.

### యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్



సాగర్, శ్రుతి శంకర్ జంటగా నటించిన 'కాలం రాసిన కథలు' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని ఈ నెల 29న విడుదలకు సిద్ధమైంది. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. యం. యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

### పోలీస్ ఆఫీసర్‌గా విశ్వక్ సేన్



విభిన్న పాత్రలతో అలరిస్తున్న విశ్వక్ సేన్ ఇప్పుడు పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. 'దసరా' తో భారీ బ్లాక్ బస్టర్‌ను అందించిన సుధాకర్ చెరుకూరి ఈ చిత్ర నిర్మాత. శ్రీధర్ గంటా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఎవ్రీ యాక్షన్ ఫైర్స్ ఏ రియాక్షన్' అనేది సినిమా ట్యాగ్‌లైన్. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇదనీ, విశ్వక్ సేన్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తారని దర్శక నిర్మాతలు చెప్పారు. విశ్వక్ సేన్‌కు ఇది 13వ సినిమా.

### అలరించే కుర్రోళ్లు



అంతా కొత్త వారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్, సాయిదుర్గ తేజ్, అడవి శేష్, నాగబాబు, వెంకీ అట్లూరి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిత్ర సమర్పకురాలు నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'పదిహేను మంది కొత్త ఆర్టిస్టులను పరిశ్రమకు అందిస్తున్నాను..అనే తృప్తి నాకు ఉంది. చిత్ర దర్శకుడు వంశీ 'పేరు ఇకపై ఎక్కువగా వినిపిస్తుంది' అని చెప్పారు. చిత్రం పెద్ద హిట్ కావాలని అతిథులు కోరారు.

## డజనుకు పైగా చిత్రాలు.. ఒకే రోజు!



**ఒకే రోజు మూడు నాలుగు సినిమాలు విడుదల కావడం సర్వసాధారణమే. సంక్రాంతికో.. దసరాకో.. ఇలా ఆరు లేదా ఏడు సినిమాలు ఒకే రోజు విడుదలైన సందర్భాలు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకూ భారీ బడ్జెట్ చిత్రాలే ఉంటాయి. మీడియం బడ్జెట్‌లో తయారైన చిత్రాలు కూడా ఒక రోజున ఐదారు విడుదలైన సందర్భాలు లేకపోలేదు. అయితే వచ్చే గురువారం (ఆగస్టు 15) నాడు ఒకటి కాదు రెండు కాదు .. దాదాపు డజనుకు పైగా దక్షిణాది చిత్రాలు వెండితెర పై సందడి చేయనున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు లాంగ్ వీకెండ్ కూడా కలసి వస్తుండడమే ఈ సందడికి కారణం. ఆ సినిమాల వివరాల్లోకి వెళితే...**



మాస్ మసాలా సినిమాలకు పెట్టింది పేరు రవితేజ. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'మిస్టర్ బచ్చన్'తో థియేటర్లలో జోష్ తీసుకురావడానికి దర్శకనిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. ఇందులో రవితేజ, బిగ్ బీ అమితాబ్ ఫ్యాన్‌గా కనిపించనున్నారు. సినిమాలో ఆయన ఇన్‌కమ్ టాక్స్ అధికారి పాత్రను పోషించారు. . యాక్షన్‌తో కూడుకున్న ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. గతంలో రవితేజతో 'షాక్', 'మిరపకాయ్' వంటి చిత్రాలు తెరకెక్కించిన హరీశ్ శంకర్ దీనికి దర్శకుడు. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ సినిమాలో రవితేజ వింటేజ్ లుక్, నూతన నటి భాగ్యశ్రీ బోర్సే అందాలు సినిమాకు ప్లస్ అవుతాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.



### బంగారు గనుల నేపథ్యంలో...

'శివ పుత్రుడు', 'అపరిచితుడు' వంటి చిత్రాలతో తెలుగుతోనూ పాపులర్ అయిన నటుడు విక్రమ్. ఆయన లేటెస్ట్‌గా నటించిన పీరియాడికల్ డ్రామా చిత్రం 'తంగలాన్'. 'మద్రాస్', 'కాలా' చిత్రాల ఫేమ్ పా.రంజిత్ దీనికి దర్శకత్వం వహించారు. 19వ శతాబ్దంలో కర్ణాటకలోని కోలార్ బంగారు గనుల కార్మికుల జీవితాల నేపథ్యంలో జరిగే కథగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలో విక్రమ్‌తో పాటు పాత్రధారులందరూ విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా అయినా విక్రమ్ విజయాల కొరతను తీరుస్తుందని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్.. సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి.

### డబుల్ ఎంటర్టైన్‌మెంట్



'ఇస్మార్ట్ శంకర్'తో 2019లో సూపర్ హిట్ కొట్టారు డైరెక్టర్ పూరి జగన్నాథ్, హీరో రామ్ పోతినేని. వారి కలయికలో ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'పై భారీ అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న పూరీ జగన్నాథ్, రామ్ పోతినేనికి ఈ చిత్ర విజయం చాలా కీలకం కానుంది. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచేసేలా చేశాయి. యాక్షన్ సన్నివేశాలకు థియేటర్స్‌లో పూనకాలు గ్యారంటీ అని చిత్ర బృందం ధీమాగా ఉంది. పూరి మార్క్ డైలాగ్స్‌ను తెలంగాణ యాసలో రామ్ పలికిన తీరు.. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటిస్తుండడం, మణిశర్మ సంగీతం సినిమాకు ప్రధానాకర్షణగా ఉండనున్నాయి.

### 'ఆయ్' అంటూ సందడి

గోదావరి యాస నేపథ్యంలో.. ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఆ కోవలోకి చెందిన చిత్రమే 'ఆయ్'. 'మేం ఫ్రెండ్సండి' ట్యాగ్‌లైన్. ఫుల్ లెంగ్త్ వినోదం గ్యారంటీ అంటూ ప్రచార చిత్రాలతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ సినిమాను అంజి కంచిపల్లి తెరకెక్కించారు. నార్నే నితిన్, నయన్ సారిక ఇందులో హీరో హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో సినిమాకు పాజిటివ్ బజ్ వచ్చింది.

### అదే రోజున ఈ చిత్రాలు కూడా...



నటనా ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే కీర్తి సురేశ్.. కయల్విజి అనే పాత్రలో, హిందీ రాని తమిళమ్మాయిగా.. నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'.. 'ఎవడే సుబ్రమణ్యం', 'కల్యాణ వైభోగమే' ఫేమ్ మాళవిక నాయర్ నటించిన 'క్రిష్ణమ్ ప్రణయ సఖీ' అనే కన్నడ సినిమా.. హిందీ చిత్రం 'అంధాధూన్' రీమేక్‌గా తమిళంలో తెరకెక్కిన 'అంధగాన్'.. 'డిమోంటీ కాలనీ' అంటూ తెలుగు వారిని భయపెట్టిన తమిళ హారర్ చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న 'డిమోంటీ కాలనీ 2'.. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ నటించిన థ్రిల్లర్ 'భైరతి రణగల్'.. భావన నటించిన 'హంట్' అనే మలయాళ హారర్ థ్రిల్లర్.. 'దృశ్యం' సినిమా సిరీస్‌తో నేషనల్‌వైడ్ గుర్తింపు పొందిన జీతూ జోసెఫ్ తెరకెక్కించిన కామెడీ ఎంటర్టైనర్ 'నున కూజి'.. 'వాజా' అనే మలయాళ కామెడీ చిత్రం కూడా అదే రోజు బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాలతో పోటీ పడుతున్నాయి. ఈ సినిమాల్లో ఏవి ప్రేక్షకుల ఆదరాభిమానాలు దక్కించుకుంటాయో ఈ నెల 15 వరకు వేచి చూడాల్సిందే.

### పెద్ద విజయం కోసం... చిన్న కథ



వినోదాత్మక చిత్రాలతో ఓ వైపు అలరిస్తూనే.. ప్రయోగాత్మక చిత్రాలు, వైవిధ్యమైన పాత్రలకు ఎప్పుడూ ముందుండే నటుడు ప్రియదర్శి ఆయన చాణక్య వర్మ అనే పాత్రతో స్కూల్ టీచర్‌గా నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. సెలక్టివ్‌గా సినిమాలు చేసే నివేదా థామస్ ఇందులో ఓ మధ్య తరగతి ఇల్లాలి పాత్రను పోషించారు. విశ్వదేవ్, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించారు. నంద కిశోర్ ఈమని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతో పాటు గుండెని బరువెక్కించే భావోద్వేగాలూ ఉన్నాయని టీజర్ ద్వారా తెలుస్తోంది.

# ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోండి

- కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించండి
- విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

**విజయనగరం రూరల్, ఆగస్టు 6:** విద్యార్థులు కష్టపడి చదవి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితం పాఠ్యపుస్తకాలను కళాశాల ఆవరణలో మంగళవారం ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆదితి మాట్లాడుతూ, విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. దీనిని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ● జిల్లా కేంద్రాసుపత్రిలో వీల్ చైర్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, జిల్లా కేంద్రాసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్టు చెప్పారు. వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ●పైడిమాంబ వనంగుడి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. ఇంత వరకూ చదురుగుడి వద్ద ప్రతి రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూవస్తున్నారు.. తాజాగా పైడిమాంబ వనంగుడి వద్ద కూడా అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదితి మాట్లాడుతూ, పైడిమాంబ ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు.


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందిస్తున్న అదితి

# అప్రమత్తంగా వ్యవహరించాలి

- కంట్రోల్ రూం తనిఖీ చేసిన ఎస్పీ వకుల్ జిందాల్

**క్రైం:** జిల్లాలో నేరాల నియంత్రణకు కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కంట్రోల్ రూంను, క్వార్టర్స్‌ను, స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిగస్తీలను నిరంతరం పరిశీలించి ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చెయ్యాలన్నారు. విధులను పర్యవేక్షించేందుకు నియమించిన అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తంచేసి నేరాలు జరగకుండా చూడాలన్నారు. డయల్ 100, మహిళల బధ్రతకు ఏర్పాటు చేసిన ఎస్.ఓ.ఎస్ కాల్స్ పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ఇళ్లల్లో దొంగతనం జరగకుండా లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పనితీరును ఏ.ఎ ప్రాంతాల్లో అమర్చేది.. వాటిని పోలీస్ కంట్రోల్ రూంనుంచి ఏ విధంగా పర్యవేక్షిస్తున్నదీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎదైనా నేరం జరిగినట్లుగా ఫిర్యాదు అందిన వెంటనే ఇతర ప్రాంతాలను స్టేషన్‌ను అప్రమత్తం చేసి, నేరస్థులు పట్టుబడే విధంగా కంట్రోల్ రూం సిబ్బందిని ఆదేశించారు. ఎస్‌బీసీఐ నరసింహమూర్తి, కంట్రోల్ రూమ్ సీఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


కంట్రోల్‌రూమ్‌లో కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

## అభివృద్ధి పథంలో నడిచేవిధంగా కేంద్ర బడ్జెట్

**విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 6:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అభివృద్ధి పథంలో నడిచే విధంగా ఉందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపు గంటి ప్రకాష్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో బడ్జెట్-2024 అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా పలు పథకాలు చేపట్టారన్నారు. ఎం రామారావు మాట్లాడుతూ, అమరావతి రాష్ట్ర నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించడం సంతోష దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సీపీ జైన్, మారుతీరాజ్, రవ్వా శ్రీనివాస్, చంద్రశేఖరరావు, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వక్త

## విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

**లక్కవరపుకోట, ఆగస్టు 6:** విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని తద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాహసం స్వచ్ఛంద సంస్థ ప్రవేశపెట్టిన విజయపదం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులకు రూ.120 లక్షల విలువగల టీషర్టులు ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. సంస్థ అధినేత మాచవరపు గణేష్ మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో సాహసం స్వచ్ఛంద సంస్థ ద్వారా జిల్లా స్థాయి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జీడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్, ఎంఈవో కూర్మారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విజయపథం బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

## వార్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**బొబ్బిలి, ఆగస్టు 6:** వార్డుల పరిధిలో వచ్చే ప్రజాసమస్యలపై వెంటనే స్పందించి వాటికి పరిష్కారం చూపాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, రూటు సూపర్‌వైజర్లు, పబ్లిక్‌హెల్త్ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ప్రతి రోజూ ప్రతి వార్డులో కాలువలు శుభ్రం చేయించాలని, వర్షపు నీటి ప్రవాహానికి ఎక్కడా అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం, అమ్మకాలపై దాడులు, తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనరు తన సిబ్బందితో కలిసి పూల్‌బాగ్, జంగాలవీధి, యాతవీధి, ప్రాంతాలలో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలను గుర్తించి వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశారు.


వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

## 'సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం'

**వేపాడ:** రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, ఆర్టికల్ 341ని ప్రశ్నించేలా ఉందని మాల మహానాడు మండల శాఖ నాయకుడు దేబారిక కిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల జాబితాను మార్చే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడారి అప్పారావు, కొరుపోలు గంగరాజు, డోల నాగేష్, దేబార్కి రవి, కెర్రి దేముడు, పొడుగు మధు, నల్ల ప్రదీప్, పొడుగు అప్పారావు, నరేంద్ర, గట్టు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

## పంటల బీమా అమలు చేయండి

**కలెక్టరేట్:** గత ప్రభుత్వం హయంలో పంటలు బీమా అమలు కాకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని భారతీయ జనతా కిసాన్ మోర్చా నాయకులు మంగళవారం డీఆర్‌వో అనితకు వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం హయంలో పంటల బీమాను పూర్తిగా విడిచిపెట్టడం వల్ల చీడపీడలతో పంటలకు తీవ్ర నష్టం చేకూరిందని, నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేయడం వల్ల ఇబ్బంది వచ్చిందని వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మినుము, పెసర, నువ్వులు, కూరగాయలు తదితర పంటలు దెబ్బతిన్నాయని వినతిలో పేర్కొన్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పంటల నష్టం అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు పాలవలస సింహాచలం, నాయకులు బవిరెడ్డి శివ ప్రసాద్ రెడ్డి, కిసాన్‌మోర్చా అనకాపల్లి ఇన్‌చార్జి బూర జగ్గారావు తదితరులు ఉన్నారు.


వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

## గుర్రపు డెక్క తొలగించాం

**బొబ్బిలి రూరల్:** వెంగళరాయ సాగర్ పిల్ల కాలువ గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలతో నిండి పోయిందని దిబ్బగుడ్డివలసకు చెందిన రైతు మోహన్‌రావు మంగళవారం తెలిపారు. గుర్రపు డెక్క వల్ల కాలువ ద్వారా నీరు సరఫరా కావడం లేదని అన్నారు. గ్రామస్తులు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు విన్నవించుకోగా ఆయన సొంత నిధులు ఇచ్చారని తెలిపారు. గోపాలరాయుడుపేట రైతులతో కలిసి శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కలను తొలగించామని తెలిపారు.


వెంగళరాయ సాగర్ పిల్ల కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

## 195 మంది కౌలు రైతుల గుర్తింపు

**రేగిడి:** మండలంలోని వివిధ గ్రామాల్లో 195 మంది కౌలు రైతులను ఎంపిక చేసి... వీరికి రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఏఓ మురళీ కృష్ణ తెలిపారు. మంగళవారం దేవుదళ ఎస్‌బీఐ, రేగిడి యూనియన్ బ్యాంక్, ఉంగరాడ గ్రామీణ వికాస్ బ్యాంక్ అధికారులను కలిసి కౌలు రైతుల డాక్యుమెంట్లు అందించినట్లు ఏఓ వెల్లడించారు. ఆయన వెంట వివిధ గ్రామాల వ్యవసాయ అసిస్టెంట్‌లు ఉన్నారు.


డాక్యుమెంట్లు అందిస్తున్న ఏవో, సిబ్బంది

## విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

**రాజాం:** స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఉన్న ఎంపీఈ పాఠశాలలో మంగళవారం కొత్తా అనంతరావు, చంద్రవతి దంపతుల సహకారంతో రాజాం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ సాయిప్రశాంత్ విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. వీటితో పాటు మోటివేషన్ స్పీకర్ బూరాడ శివకృష్ణ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ పాఠశాలతో పాటు కంచరాం, పుల్లిట, మామిడిపల్లి, వంగర గ్రామాల్లో ఉన్న పాఠశాలల విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేసినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంకి చైతన్య కుమార్, ప్రిన్స్‌పాల్ విజయలక్ష్మి, రమణ, దుర్గాభవాని, శ్రీనివాసరావు, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ దృశ్యం

## 'భీమసింగి' ఎండీగా సన్యాసినాయుడు

**జామి:** భీమసింగి సుగర్స్ కర్మాగారం ఎండీగా వి.సన్యాసినాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రస్తుతం పని చేస్తున్న విక్టర్‌రాజు పదవీ విరమణ చేసిన సందర్భంగా విశాఖ జిల్లా చోడవరం సహకార చక్కెర కర్మాగారం ఎమ్‌డీగా పని చేస్తున్న సన్యాసినాయుడును ప్రభుత్వం నియమించింది. నూతన ఎమ్‌డీ ఈ మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఎవరో వస్తారని ఎదురు చూడక..

- చిట్టిగెడ్డ రెగ్యులేటర్‌కు శ్రమదానంతో మరమ్మతులు

**రేగిడి:** మండలంలోని సాయన్న చానల్, దాని అనుబంధ కాల్వలకు ఆరుచోట్ల షట్టర్ల మరమ్మతుల విషయమై స్థానిక రైతులు అధికారులకు చెప్పి, చెప్పి విసిగిపోయారు. ఇటీవల ఒక ప్రైవేటు కంపెనీ స్వచ్ఛందంగా ఒకటి, రెండుసార్లు షట్టర్లు వేసినా మూణ్నాళ్ల ముచ్చటగా ఉంటున్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 5న 'రెగ్యులేటర్ పాడై.. సాగునీటికి ఇక్కట్లు' శీర్షికన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం చిట్టిగెడ్డ రెగ్యులేటర్‌లో ఒక షట్టరు వరద నీటికి కొట్టుకుపోయింది.

**శ్రమదానంతో...**

దిగువ గ్రామాలకు నీరు వెళ్లాలంటే చిట్టిగెడ్డ రెగ్యులేటర్ సిస్టమ్ సక్రమంగా పని చేయాలి. ఈ చానల్ పరిధిలోని సంకిలి, దేవుదళ, పుర్లి, పుర్లిపేట, కొమిర తదితర గ్రామాల రైతులు మంగళవారం శ్రమదానం చేశారు. రెగ్యులేటర్ సిస్టమ్‌కు ఉన్న షట్టర్ల స్థానంలో కర్రలతో అడ్డుపూని వేసి నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. ఈ తాత్కాలిక మరమ్మతులను ఇరిగేషన్ సిబ్బంది పర్యవేక్షించినట్లు స్థానిక రైతులు, జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు నారు జనార్దనరావు తదితరులు తెలిపారు.


సంకిలి చిట్టగెడ్డ హెడ్ షట్టర్లకు మరమ్మతులు చేసుకుంటున్న రైతులు

### స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక

**రింగురోడ్డు:** నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఐదుగురు ఎన్నికైనట్లు కమిషనర్ ఎంఎం నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లు అల్లు చాణక్య వెంకటరంగారావు, రూపాదేవి, వీర వెంకట్ రాజేశ్వరావు, సుంకరి నారాయణస్వామి ఏకగ్రీవంగా ఎన్నికనట్లు తెలిపారు. వీరిని కమిషనర్, మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు అభినందించారు.

### ఎస్పీని కలిసిన సీఐ రామకృష్ణ

**విజయనగరం క్రైం:** ఎస్పీ వకుల్ జిందాల్‌ను భోగాపురం సీఐగా బాధ్యతలు చేపట్టిన జి.రామకృష్ణ మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. భోగాపురం సర్కిల్ పరిధిలో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై ఎస్పీ నిర్దేశించారు.

### నాడు-నేడు రెండో దశకు సన్నాహాలు

**బొబ్బిలి రూరల్:** గోపాలరాయుడుపేట గ్రామంలో మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గంట శంకరరావు తమ పాఠశాలలో రెండో దశ నాడు-నేడు పనులకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. దీని కోసం రూ.36 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. పాఠశాలలో అదనపు గదులు, తదితరాలకు రూ.25 లక్షలు ఖర్చయ్యాయని తెలిపారు. ఇంకా భవనం పైన 2 గదుల నిర్మాణం, మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు.

### ఎన్‌జీవోలు దరఖాస్తు చేసుకోండి

**కలెక్టరేట్:** సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉన్న పట్టణ అణగారిన పిల్లల వసతి గృహం(నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆవస్య విద్యాలయం)కు అర్హతగల ఎన్‌జీవోల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సమగ్ర శిక్షా ఏపీసీ, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 12 వరకూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎన్‌జీవో సంస్థ ప్రభుత్వ అనుమతితో రిజిస్ట్రేషన్ గానీ గుర్తింపు పొంది ఉండాలన్నారు.

### పురుగుల మందు పిచికారీపై అవగాహన

**జామి:** జామిలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పీటీసీ బండారు పెదబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**బొబ్బిలి రూరల్:** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. మెట్టవలస గ్రామంలో మంగళవారం ఓడీఎఫ్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఈవోఆర్డీ, స్థానిక ఇంజినీరింగ్ అసిస్టెంటు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### శ్రీవరి సాగుపై అవగాహన

**బొబ్బిలి:** పారాది గ్రామంలో మంగళవారం బొబ్బిలి డివిజన్ ఏడీఏ ఎం.శ్యాంసుందర్ శ్రీవరి సాగుపై రైతు వెంకటినాయుడు పొలంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవరి సాగు విధానంతో అధిక దిగుబడి వస్తుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

### సేంద్రియ ఎరువు వినియోగంతో అధిక లాభాలు


వేస్ట్ డికంపోజర్ సేంద్రియ ఎరువు తయారీపై రైతులకు అవగాహన దృశ్యం

**బొబ్బిలి రూరల్:** వేస్ట్ డికంపోజర్ సేంద్రియ ఎరువు వినియోగంతో భూసారాన్ని పెంచడంతో పాటు, రైతులకు సాగు ఖర్చును తగ్గించవచ్చని బొబ్బిలి డివిజన్ ఏడీఏ ఎం.శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో మంగళవారం వేస్ట్ డికంపోజర్ సేంద్రియ ఎరువు తయారీ విధానంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

### ఆశీలు వేలం పాట నిర్వహించండి

కొత్తవలస: కొత్తవలస రోజువారీ మార్కెట్‌లో ఆశీల వసూళ్లకు సంబంధించి వీలైనంత త్వరగా వేలం పాట నిర్వహించాలని పంచాయతీ పాలక వర్గ సభ్యులు అధికారులకు సూచించారు. మంగళవారం కొత్తవలస మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ మచ్చ రామస్వామి ఆధ్వర్యంలో జరిగింది. గత నాలుగు నెలలుగా వివిధ కారణాలతో పాట జరగకపోవడం వల్ల ఆదాయానికి గండి పడుతోంది. దీంతో సభ్యులు దీనిపై సమావేశంలో చర్చించారు. పాట జరగని నాలుగు నెలలకు కలిపి కేవలం రూ.88 వేలు మాత్రమే ఆదాయం రావడం పట్ల 6వ వార్డు సభ్యుడు, మాజీ సర్పంచ్ గొరపల్లి రాము అధికారులను నిలదీశారు. నెలకు కనీసం రూ.లక్ష వరకు రావలసి ఉందన్నారు. సమావేశంలో స్టేషనరీ, పారిశుధ్యం, సులబ్ కాంప్లెక్స్ వేలం పాట అంశాలపై చర్చించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కె.ధర్మారావు, ఈఓ రత్నమాలిక సభ్యులు పాల్గొన్నారు.

### రాజాం రూరల్ సీఐగా ఉపేంద్రరావు



**రాజాం/రూరల్:** రాజాం రూరల్ సీఐగా హెచ్.ఉపేంద్రరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు రూరల్ సీఐగా పనిచేసిన శ్రీనివాస్‌రావుకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఎస్‌కోట నుంచి ఉపేంద్రరావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. శాంతి భద్రతల రక్షణకు తనవంతు కృషిచేస్తానని ఆయన అన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కరించండి

**జామి:** మండల కేంద్రమైన జామి బీసీ కాలనీ, రెల్లివీధి, దొండపర్తి జంక్షన్, అబ్బుల కళ్లాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంతగా కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకటత్రివేణి అన్నారు. మంగళవారం ఈఓ శ్రీదేవికి వినతి పత్రం అందించారు. తాగునీటి సమస్య తీర్చడంతో పాటు రెండు పూటలా సరఫరా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టా రమణ, ఇప్పాక ఈశ్వరరావు, జేమ్స్, సంతోష్ పాల్గొన్నారు.


నీటిసమస్య తీర్చాలని ఈవోకు ఫిర్యాదుచేస్తున్న మాజీ సర్పంచ్ త్రివేణి

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

**తెర్లాం, ఆగస్టు 6:** భార్యతో మనస్పర్థల నేపథ్యంలో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో రాజయ్యపేట గ్రామానికి చెందిన మెండి తిరుపతి(32) వ్యవసాయ, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఏడేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆ తరువాత భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ గొడవలు పడుతుండేవారు. ఈ క్రమంలో సుమారు సంవత్సరన్నర క్రితం భార్య అతనిని విడిచిపెట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర వేదనకు గురై తాగుడుకు బానిసైన తిరుపతి మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గ్రామ శివారులో ఉన్న స్మశానవాటికలో ఉన్న షెడ్డులో తన బెల్టుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి గురువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## పోక్సో కేసులో ఒకరికి జైలు

**రామభద్రపురం:** మండల పరిధిలోని రొంపల్లి గ్రామంలో బాలికపై అత్యాచారం చేసిన కేసులో యువకుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో జడ్జి కే.నాగమణి మంగళవారం తీర్పు వెల్లడించారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన భవిరెడ్డి రవితేజా అదే గ్రామానికి చెందిన బాలికపై అక్టోబర్ 2021లో అత్యాచారం చేయడంతో అప్పట్లో పోలీసులు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వాదనల అనంతరం నేరారోపణ రుజువు కావడంతో ముద్దాయికి 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ ఓ ప్రకటనలో తెలిపారు.

### యువకుడిపై పోక్సో కేసు

**బొండపల్లి:** మండలంలోని ఓ పాఠశాల వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న బాలికను పెళ్లిపేరుతో తీసుకువెళ్లిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ ఎల్.గోపి మంగళవారం తెలిపారు. పూసపాటిరేగ మండలానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన కొమర గురయ్య(22) పెళ్లి చేసుకుంటానని చెప్పి ఈ నెల 3న వసతి గృహం నుంచి తీసుకెళ్లాడు. దీనిపై పాఠశాల హెచ్ఎం బత్తూరు శ్రీరామాచారి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ మహేష్ దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని గజపతినగరం కోర్టుకు తరలించారు.

## ఖండ్యాంలో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**రేగిడి:** మండలంలో ఖండ్యాం గ్రామ నాగావళి సమీపంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పుర్లికు చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. అనధికార క్వారీల నుంచి ఇసుక తరలింపుపై ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ హెచ్చరించారు.

## టీడీపీ నేత కందువా ప్రకాష్ అనారోగ్యంతో మృతి

**విజయనగరం రూరల్, ఆగస్టు 6:** టీడీపీ నగర ఎస్సీ సెల్ నాయకుడు కందువా ప్రకాష్(54) అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం సాయంత్రం తోటపాలెంలోని ఆయన ఇంట్లో చనిపోయారు. టీడీపీ దళిత విభాగం పటిష్ఠత కోసం, తాజాగా జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే అదితి గజపతి రాజు విజయానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన మృతి పట్ల విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగా రుబాబు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు మామిడి రవిశంకర్, షైలిపిల్లి పైడిరాజు తదితరులు ఆయనకు నివాళులు అర్పించారు.


ప్రకాష్ (ఫైల్)

## సాయన్నగెడ్డకు గండి

**పొందూరు:** పొందూరు మండలం గోకర్ణపల్లి, విజయనగరం జిల్లా సంతకవి టి మండలం గారన్నాయుడు పేట గ్రామాల సమీపంలో సాయన్నగెడ్డకు పడిన భారీ గండి పడింది. దీంతో ఇరిగేషన్ అధికారులు మంగళ వారం మరమ్మతు పనులు చేపట్టారు. సాయన్నఛానెల్‌కు సోమవారం భారీ గండి పడి నీరు భారీగా వృథాగా పోవడంతో ఆ ప్రభావం పొందూరు మండలం గంగ్రేడు, తాడివలస గ్రామలపై పడింది. దీంతో తాడివలస, గంగ్రేడు, లొద్దలపేట తది తర గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛంగా గండిపూడ్చే పనులు చేశారు. ఫిర్యాదు రావడంతో మంగళవారం ఇరిగేషన్ అధికారు గండిని పూడ్చేందుకు శాశ్వతపనులు చేపట్టారు. ఈ పనులను ఇరిగేషన్ ఏఈ రమణ పరిశీలించారు.


గండి పనులను పరిశీలిస్తున్న ఏఈ

## లోక్‌సభ స్పీకర్‌కు పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకం

**విజయనగరం (ఆంధ్రజ్యోతి):** పి.వి.జి రాజు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అతని జీవిత చరిత్రను తెలిపే ఇంగ్లిష్ వెర్షన్ పుస్తకాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఎంపీ కలిశెట్టి అందజేశారు. ద లాస్ట్ మహారాజా ఆఫ్ విజయనగరం పుస్తకాన్ని మంగళవారం ఢిల్లీలో పార్లమెంటు సమావేశాల అనంతరం స్పీకర్‌కు అప్పలనాయుడు అంద జేశారు. ● జిల్లాలోని ప్రధాన మంత్రి కేంద్రీయ విద్యాలయాల్లో సాయంత్రం షిఫ్టల ప్రతిపాదనను పరిశీలించి ఆమోదించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించినట్టు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. రాజాం, పార్వతీపురంలలో విద్యాలయాలను నూతనంగా స్థాపించాలని ఎంపీ కలిశెట్టి కోరారు.

**బొబ్బిలి:** రిటైర్డ్ కార్మికులకు కనీస పెన్షన్ నెలకు రూ.తొమ్మిది వేలు చెల్లించాలన్న డిమాండ్‌కు టీడీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు జిల్లా పెన్షనర్ల సంఘ నాయకులు పి.శంకరరావు, వి.శేషగిరిరావు తెలిపారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ ధర్నా శిబిరానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వచ్చి మద్దతు తెలిపారని వారు చెప్పారు.


స్పీకర్‌కు పుస్తకం అందిస్తున్న కలిశెట్టి

## రేపు విద్యాకమిటీల ఎన్నికలు

**బొబ్బిలి:** పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను తల్లిదండ్రుల నుంచి తొలుత ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరు మహిళలు తప్పనిసరి. ముగ్గురిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉండాలి. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు సభ్యులను ఎన్నుకోవాలి. మధ్యాహ్నం మూడు గంటల లోపు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలి. చైర్మన్ పురుషుడు అయితే, వైస్‌చైర్మన్‌గా మహిళను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ రెండు పదవులు పురుషుడు, లేదా స్త్రీలను ఎన్నుకోవాలి.

**సమస్యాత్మక పాఠశాలల గుర్తింపు**

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని బొబ్బిలి పట్టణం, మండలంలో పలు పాఠశాలలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఆయా పాఠశాలల్లో ఎటువంటి అవాంఛనీయన ఘటనలు పునరావృతం కాకుండా తగిన బందోబస్తు నిర్వహిస్తున్నారు. అంతా పక్కాగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని పాఠశాలల హెచ్ఎంలకు సూచనలిచ్చినట్లు ఎంఈవో చల్లా లక్ష్మణరావు తెలిపారు.

**సజావుగా నిర్వహించాలి**

**రామభద్రపురం:** ఈనెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్య, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కర్రి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి రూరల్:** బొబ్బిలి మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవా రం ఎంఈవో చల్ల లక్ష్మణరావు అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వ హించారు. ఎస్‌ఎంసీ ఎన్నికలపై సూచనలిచ్చారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు. ● **వంగర:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీలకు 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు విజయ్‌కుమార్, దుర్గారావు తెలిపారు. అదే రోజు ఎన్నికల నిర్వహణ, విజేతలతో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు వెల్లడించారు.

## పోరాటాలపై వైసీపీ ఉక్కుపాదం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విల్సన్



మాట్లాడుతున్న విల్సన్

**పార్వతీపురం టౌన్:** ప్రజల సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేపట్టిన ప్రజాసంఘాలు, వామపక్షాలపై గత వైసీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జె.విల్సన్ ఆరోపించారు. మంగళవారం పార్వతీపురంలోని గిరిజన్ భవన్‌లో సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అరాచ కాలకు పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వర రావు, జిల్లా కార్యదర్శి కె.మన్మథ రావు, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ పాల్గొన్నారు.

## ఆదివాసీ జాబితాలో చేర్చవద్దు


అంతర్‌సింగ్ ఆర్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ పరిషత్ సభ్యులు

**పార్వతీపురంటౌన్:** బోయ వాల్మీకులను ఆదివాసీ జాబితాలో చేర్చవద్దని ఏపీ ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్రప్రధాన కార్యదర్శి మీనక సింహాచలం, వికాస్ పరిషత్ సభ్యులు కోరారు.ఈమేరకు ఢిల్లీలోని జాతీయ ఆదివాసీ కమిషన్ గౌరవాధ్యక్షుడు అంతర్ సింగ్‌ఆర్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఏపీ, తెలంగాణల్లో ఉన్న బోయ వాల్మీకిలు ఆదివాసీలకు చెందిన వారుకాదని వారిని తమ జాబితాలో చేర్చడం సరికాదన్నారు. బోయ వాల్మీకిలకు ఆదివాసీ జాబితాల్లో కలపాలన్న దురుద్ధేశం ఉంటే జాతీయస్థాయిలో నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు.

## సాగు భూములకు పట్టాలివ్వాలి

● వ్యవసాయ కార్మిక, కేవీపీఎస్, గిరిజన సంఘాల సభ్యులు


నిరసన తెలుపుతున్న శివ్వాం దళిత కుటుంబాలు

**పార్వతీపురంటౌన్:** జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని, వ్యవసాయ కార్మిక, కేవీపీఎస్, గిరిజన సంఘల సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద తమ భూములను అప్పగించాలని కోరుతూ గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయా సంఘాలతో పాటు సీఐటీయూ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో సూరిబాబుఉమ, ఉపేంద్ర, రాజశేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటు చేయండి

**పార్వతీపురంటౌన్:** పట్టణంలోని దుర్గ చెట్టు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లే దారిలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆలయ నిర్వాహకులు మురపాక కాళిదాసు శర్మ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే విజయచంద్రను శర్మతోపాటు ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు.

## ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

**గుమ్మలక్ష్మీపురం:** తాడికొండ పీహెచ్‌సీలో పనిచేస్తూ అనారోగ్యంతో చనిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగి రంగళి ఆదినారాయణ కుటుంబానికి లక్ష రూపాయలు వైద్యుడు బుద్దేశ్వరరావు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందకపోవడంతో ఉద్యోగులు ఆర్థికసాయాన్ని అందించామని తెలిపారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన

**పాలకొండ:** పాలకొండ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులకు సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.శ్రీనివాస్ మంగళవారం అవగాహన కల్పించారు. పాలకొండ ఏడీఏ రత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని అగ్రి ల్యాబ్ వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటు

**సీతంపేట:** జనసేన పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఎం.విశ్వనాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈకమిటీల్లో అధ్యక్ష,ఉపాధ్యక్షులు, గ్రామప్రధాన కార్యదర్శి, గ్రామకార్యదర్శులు, సంయుక్త గ్రామ కార్యదర్శులు ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## నేరడి ఇసుక ర్యాంప్ పరిశీలన


**భామిని:** వంశధార నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం మైన్స్ పీఏలు హరనాథరావు, శిరీష, డీటీ శేఖరం, వీఆర్వో జి.వెంకటరావు నేరడి ఇసుక ర్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వుతున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల వ్యక్తులు, వాహనాలు లేకపోవడంతో జీడితోటలో యంత్రం ఉన్నట్లు గుర్తించి యజమానికి ఫోన్‌ద్వారా సంప్రదించినా ఎత్తకపోవడంతో డీటీకి అప్పగించారు.

## నీతిఆయోగ్ శిక్షణకు ఎంపీటీసీల డుమ్మా

**భామిని:** భామినిలో ఎంపీటీసీ సభ్యులకు మంగళవారం నీతిఆయోగ్ శిక్షణ ఏర్పాటుచేసిన శిక్షణకు వారు డుమ్మా కొట్టారు. కోఆర్డినేటర్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం సెరిమల్ ఫౌండేషన్ మేనేజర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఏవో సింహాచలం, ఏపీవో తులసీదాస్, ఏపీఎం భవానీ హాజరుకాగా, మిగిలిన కుర్చీలనీ ఖాళీగా దర్శనమిచ్చాయి.


సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

## రాయగడ కళాశాలలో హ్యాకథాన్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మనోజ్ సత్యవాన్

**రాయగడ:** రాయగడ స్వయంప్రతిపత్తి కళాశాలలో మంగళవారం, అంతర్ కళాశాల హ్యాకథాన్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఎగ్జిబిషన్‌లో స్టాళ్లను పరిశీలించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ పరికరాలతో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన ఏర్పాటుచేశారు. గుడారి, గుణుపురం, రామన్నగుడ, పద్మాపూర్ కళాశాలల నుంచివచ్చిన విద్యార్థులు తాము తయారు చేసిన వివిధ పరికరాలు యంత్రాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా 17 స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. అనంతరం అదనపు కలెక్టర్ భాస్కర్‌రౌయిత్, జిల్లా విద్యాశాఖా ధికారి డాక్టర్ బసంతకుమార్ కళాశాల సిబ్బంది విద్యార్థులు కూడా పరిశీలించారు.

## ఖైదీలకు ఆట వస్తువులు

**రాయగడ:** రాయగడ సబ్‌జైలులోని ఖైదీలకు మంగళవారం రాయగడ యూత్ వాకర్స్‌క్లబ్ సభ్యులు ఆటవస్తువులు, బిస్కట్లు, శీతల పానీయాలు డస్ట్‌బిన్స్, శానిటర్ ప్యాడ్స్ వంటి వస్తువులను పంపిణీ చేశారు. క్లబ్ సభ్యుల సేవలను పోలీసు,జైలు అధికారులు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వంశీకిరీటి, కార్యదర్శి అవంతి, లీనా సేనాపతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ఆదివాసీల అభివృద్ధికి కృషి

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



కురుపాం రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

**కురుపాం రూరల్:** ఆదివాసీల సమగ్రాభివృద్ధి కోసం అన్ని వర్గాలు కలిసి కృషిచేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం దురుబిలిలో ఎస్ స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ షేక్ గౌస్‌ఆదివాసీల హక్కులు-అవకాశాలు అన్న అంశంపై చర్చ కార్యక్రమం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఏజెన్సీప్రాంతల్లో జీడి,చింతపండు ప్రాసెస్‌యూనిట్లు నెలకొల్పాలని, మైదాన ప్రాంతాల్లోని రైతులు సాగుచేస్తున్న అరటి, చెరకు, వరి,పత్తి పంటలకు చేసే విధంగానే గిరిజనులు పండించే చింతపండు, జీడి పంటలకు ఇన్సూరెన్సు కవరేజీ కల్పించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణ మూర్తి, దురుబిలి సర్పంచ్ పువ్వల అజ్జారి, వెంపటాపు భారతి, మల్లేశ్వరారావు, సామల సింహాచలం, అడ్డమేశ్వరరావు, సన్యాసిరాజు, పువ్వల పత్తి పాల్గొన్నారు.

### మహిళలు ఆర్థిక పరిపుష్టి చెందాలి

**గుమ్మలక్ష్మీపురం:** మహిళలు ఆర్థిక పరిపుష్టి చెందాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండల సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. పలు రకాల రుణ సదుపాయాన్ని కల్పిస్తోందని చెప్పారు. మహిళలు పొదుపుపై ఆసక్తి చూపాలని, తమ పిల్లలకు విద్యాబుద్దులు అందించాలని తెలిపారు. మహిళా సంఘాల రీప్లేస్‌మెంట్ బాగుండడంతో బ్యాంకులు కూడా పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుధా, టీడీపీ నాయకులు వెంకటాపు భారతి, లక్ష్మణరావు, జనసేన నాయకులు కర్రక మల్లేష్, వెలుగు ఉద్యోగులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతం

● అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

**సాలూరు రూరల్:** తల్లిపాలు బిడ్డకు అమృతమని మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శివకుమార్ తెలిపారు. మంగళవారం మామిడిపల్లిలో తల్లిపాలవారోత్సవాలు పురస్కరించుకుని గర్భిణులు,బాలింతలతో సమావేశం నిర్వహించారు. ● **వీరఘట్టం:** పిల్లలు జన్మించిన గంటలో తల్లిపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీవో శిమ్మాలమ్మ తెలిపారు.వీరఘట్టం కూరాకులవీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, మహిళా పోలీస్ విజయ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు,బాలింతలు పాల్గొన్నారు.

●**మక్కువ:** మక్కువ మార్కొండపుట్టి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.రాజశ్రీ, ఎన్.లీలావతి పాల్గొన్నారు. ●**సీతంపేట రూరల్ :** మండలంలోని కుసిమి సెక్టార్ పరిధిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా దారిమల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.గీతాంజలి, పీహెచ్‌సీ వైద్యాధికారులు రవీంద్ర, చాందిని, సీడీపీవో రంగలక్ష్మి, సూపర్‌వైజర్ గౌరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతంపేట రూరల్ : తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


మక్కువ: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


వీరఘట్టం: మాట్లాడుతున్న సీడీపీవో సిమ్మాలమ్మ


సాలూరు రూరల్: మామిడిపల్లిలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి: డీఈ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న సోమేశ్వరరావు

**మక్కువ:** ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సాలూరు సబ్ డివిజన్ గృహ నిర్మాణశాఖ డీఈ జి. సోమేశ్వరరావు తెలిపారు. మంగళవారం మక్కువలో ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటుచేసిన లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.ఇళ్ల నిర్మాణాలు మధ్య దశలో ఉంటే త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్ బిల్లులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.కార్య క్రమంలో గృహ నిర్మాణశాఖ ఏఈ సింహాచలం పాల్గొన్నారు.

## నందివానివలసలో ఏనుగుల గుంపు

**గరుగుబిల్లి:** మండలంలోని తోటపల్లి పంచాయతీ పరిధిలోగల నందివానివలసలో ఏనుగులగుంపు తిష్టవేసింది. ఏనుగులు ఇక్కడకు సోమవారం చేరుకోగా రైతులకు చెందిన పలురకాల పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మంగళవారం గ్రామానికి ఆనుకుని ఉన్న తామర చెరువులో సేదదీరాయి. నీటి వనరుల తోపాటు పచ్చనిపంట పొలాలుఉండడంతో ఇక్కడ నుంచి ఏనుగులు కదలడం లేదని పలువురు చెబుతున్నారు. ఖరీఫ్ పనుల సమయంలో ఏనుగుల గుంపు సంచరించడంతో వ్యవసాయపనులకు ఆటంకం కలుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అటవీశాఖ అధికారులు దృష్టి సారించి సురక్షిత ప్రాంతాలకు ఏనుగులు తరలించాలని పలువురు కోరుతున్నారు.

## జగన్ హయాంలో విద్యా వ్యవస్థ ధ్వంసం

● అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సత్యనారాయణ

**గరుగుబిల్లి:** ఐదేళ్ల జగన్ పాలనలో విద్యా వ్యవస్థ ధ్వంసమైందని అరకు నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యానా రాయణ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలుచేయాలని కోరారు. మంగళవారం చిలకాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికిప్రత్యేక చొరవ చూపితే బడి బయట ఉన్న వారి సంఖ్య తగ్గుతుందని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికే పథకాలు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు. లోపాలను సవరించి ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి దృష్టి సారించాలని కోరారు. శిథిలావస్థకుచేరిన పాఠశాలలకు మరమ్మతులు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయుల పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తే పాఠశాలలకు తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు.

## భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

**జియ్యమ్మవలస:** రోడ్డు భద్రతా నియమా లు పాటించాలని ఏఎంవీఐ జి.సత్యనా రాయణ సూచించారు. మంగళవారం జియ్యమ్మవలస లోని విజయరామరాజు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మంగమ్మ ఆధ్వర్యంలో రహదారిపై ప్రమాదాలు,మద్యం సేవించి వాహనం నడుపు తున్న వాహన చోదకుడికి, రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంనడిపే వ్యక్తికి హెల్మెట్ ధరించ డం, కార్లు, ఇతర ప్రైవేటు వాహనాలు నడిపే వ్యక్తి సీటు బెల్టు ధరించడం వల్ల కలిగే ప్రయో జనాలను వివరించారు. కార్యక్రమంలో పి.నారాయణరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కక్ష పూరిత చర్యలు తగదు

● సీపీఎం నాయకుడు మూడడ్ల కృష్ణమూర్తి

**జియ్యమ్మవలస:** టీడీపీ నాయకులు చిరుద్యోగులపై కక్ష పూరిత చర్యలకు పాల్పడడం తగదని, ఈ విషయంపై ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సీపీఎం సీనియర్‌నాయకులు మూడడ్లకృష్ణమూర్తి హెచ్చరించారు. మంగళవారం జియ్యమ్మవలసలో వెలుగు ఏపీఎం నాగభూషణరావుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీవోఏలు, ఉపాధి క్షేత్ర సహాయకులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎండీఎంనిర్వాహకులు, ఆశావర్కర్లు తదితర చిరుద్యోగులపై కక్ష పూరిత ధోరణి టీడీపీ నాయకుల్లో కనిపిస్తోందని తెలిపారు. చినమేరంగి, అల్లువాడ, శిఖబడి, గవరమ్మపేట, డంగభద్ర, పెదబుడ్డిడి, చింతలబెలగాం, గెడ్డ తిరువాడ వీవోఏలను తొలగిస్తూ ప్రజాప్రతినిధులు ఏపీఎంకు ఆదే శాలివ్వడం సరికాదని, జోగులడుమ్మ క్షేత్ర సహాయకురాలిని తొలగించడం బాధాకరమని పేర్కొన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు వైసీపీ ప్రభుత్వానికి చెప్పినట్లు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.గంగునాయుడు, కె.సీతారాం, జి.శ్రీను పాల్గొన్నారు.

## వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న ఆశా వర్కర్లు

**సాలూరు రూరల్:** తోణాంలో ఆశాకార్యకర్తలు కేరళ లోని వయనాడ్ వరద బాధితుల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళ వారం విరాళాలు సేకరించారు. కార్యక్ర మంలో త్రివేణి, ఆదిలక్ష్మి, రమణమ్మ, సుజాత పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరకు విక్రయించవద్దు


ఎరువుల దుకాణంలో పరిశీలిస్తున్న ఏవో అనురాధ పండా

**సాలూరు రూరల్:** ఎరువులను వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని సాలూరు ఏవో అనురాధ పండా హెచ్చరించారు. మంగళవారం సాలూరులో ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శివరాంపురం పీఏసీఎస్‌కు ఇప్పటి 42 టన్నుల డీఏపీ,36 టన్నుల యూరియా వచ్చినట్లు చెప్పారు. అన్నంరాజువలస, కొత్తవలస ఆర్బీకేల్లో ఇప్పటికే యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మామిడిపల్లి తదితర ఆర్బీకేలకు ఎరువులు వచ్చాయని తెలిపారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**భామిని:** పాలకొండ పరిధిలోగల 33 కేవీ లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా భామిని మండలంలో బుధవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.అలాగే జంగిల్ క్లియరెన్స్ కూడా చేయనున్నట్లు పేర్కొన్నారు.

## పాఠశాలల్లో ఆటల పోటీలు

**గరుగుబిల్లి:** మండలంలోని గరుగుబిల్లి, రావివలస, ఉల్లిభద్ర, నాగూరు, రావుపల్లి, కొత్తూరు, తదితర గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. పలు ప్రైవేటు పాఠశాలల్లో కూడా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, క్రికెట్, మ్యూజికల్ చైర్, తదితర ఆటల పోటీలతో పాటు వ్యాస రచన, పాటల పోటీలను నిర్వహిస్తున్నారు.విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

## భామినిలో భారీ వర్షం

**భామిని:** భామిని, చుట్టుపక్కల ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వరిఎదలు, పత్తి చేల్లో ఎరువులు చల్లేందుకు అవకావం లభించిందని చెప్పారు.

**సీతానగరం:** సీతానగరం చుట్టుపక్కల గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. దీంతో పది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఊరట లభించింది. దీంతో పంటలు ఎండిపోతున్న సమయంలో కురిసిన వర్షం జీవం పోసింది. సీతానగరం ప్రధానవీధిలో వర్షం నీరు నిలిచి పోవడంతో చోదకులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు.

## డిగ్రీ కళాశాలకు న్యాక్ బి ప్లస్

**పాలకొండ:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ బి ప్లస్ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ మదింపు, గుర్తింపు సంస్థ కళాశాలలో బోధన ప్రమాణాలు, ఫలితాలు, పరిశోధన అంశాలు, పరిపాలన, ఇతర సదుపాయాలు పరిశీలించి బి ప్లస్ గ్రేడ్‌ను ఇచ్చినట్లు తెలిపారు. కార్య క్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడి సైకిల్ యాత్ర



**సీతంపేట రూరల్:** పశ్చిమ బెంగాళ్‌కు చెందిన యువకుడు సుప్రీయదాస్ చేపట్టిన సైకిల్‌యాత్ర మంగళవారం సీతంపేట చేరింది. పశ్చిమ బెంగాళ్ నుంచి కేరళ వరకు సైకిల్‌పై యాత్ర చేపట్టాడు. తాను పశ్చిమ బెంగాళ్ నుంచి వచ్చానని ,రెండోవిడతలో భాగంగా ఇండియా టూర్ సైకిల్‌పై చేస్తున్నానని తెలిపాడు.



## చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

● సీనియర్ న్యాయాధికారి సన్యాసినాయుడు

**సీతంపేట రూరల్:** గిరిజనులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని శ్రీకాకుళం జిల్లా సీనియర్ న్యాయాధికారి ఆర్.సన్యాసి నాయుడు సూచించారు. మంగళవారం మండలంలోని పూతికవలసలో జిల్లా న్యాయ సేవా విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు,ఏఎస్‌ఐ సంజీవరావు పాల్గొన్నారు.

● **పాలకొండ:** ఏ ఒక్క వ్యక్తి నేర ప్రవృత్తి ఉండరాదని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మంగళవారం పాలకొండ సబ్‌జైలును సందర్శించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, న్యాయవాది ఎంవీ వెంకటేశ్వరరావు, హెడ్‌వార్డర్ బి. విజయకుమార్, సిబ్బంది నాగరాజు, హేమసుందర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


సీతంపేట రూరల్ : మాట్లాడుతున్న సన్యాసినాయుడు

## భారీ వాహనాలతో బేజారు

● ట్రాఫిక్‌కు అంతరాయం ● ఇదీ సుంకి ఐటీడీఏ పార్క్ వద్ద పరిస్థితి


పార్క్ వద్ద వాహనాల రద్దీ

**గరుగుబిల్లి:** సుంకి ఐటీడీఏ పార్క్ వద్ద తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ ప్రధాన రహదారి మార్గం నుంచి నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. బొబ్బిలి సమీపంలోని పారాది వంతెన బలహీనంగా ఉండడంతో పార్వతీ పురం నుంచి నిత్యం పరిమితికి మించి బరువులతో వాహనాలు రాకపోకలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీనికితోడు ఒడిశా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన వేలాది వాహనాలు పాలకొండ గుండా ప్రయాణిస్తున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారితోపాటు కురుపాం వైపు వెళ్లే రహదారి అడుగడుగునా గోతులమయమయ్యింది. దీంతో చీకటిపడితే ఈ మార్గంలో ప్రయాణించేందుకు భయపడుతున్నారు. సుంకి సమీపంలోని ఐటీడీఏ పార్క్‌కు ఆనుకుని ఉన్న రహదారికి ఇరువైపులా వాహనాలు బారులు దీరుతున్నాయి. ఉల్లిభద్ర, సుంకి, తోటపల్లి ప్రాజెక్టు ప్రాంతంలో వాహనాలు అధికంగా తరలివస్తున్నాయి.